క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతి ఒక్కరు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన లబ్ధిదారు, కౌటాలకు చెందిన ఆదే తారకు గురువారం బ్యాంకులో రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత సాధించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలతో కుటుంబాలకు ధీమా ఉంటుందన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, భాస్కర్, గోపి, ప్రకాశ్, మోరేశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలు పనులకు వెళ్లాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్క కూలీ ఉపాధిహామీ పథకం పనికి వెళ్లాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని సావర్‌ఖెడా, గోయగాం గ్రామాల్లో కూలీలతో మాట్లాడారు. చాలా మంది ఇంకా పని ప్రారంభించలేదన్నారు.

నిరుపేద కుటుంబానికి పోలీసుల చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద దిక్కును కోల్పోయిన నిరుపేద కుటుంబానికి గురువారం రెబ్బెన పోలీసులు చేయూత అందించారు. వడ్లూరి గణపతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌లు కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు.

దేవార వినోద్‌కు సన్మానం



సన్మానిస్తున్న సేవా సంస్థ సభ్యులు

రెబ్బెన: సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో అందించిన సేవలను గుర్తించి ఇటీవల శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో నంది పురస్కారం అందుకున్న ఇందిరానగర్ కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్‌ను గురువారం గోలేటికి చెందిన స్నేహ కల్చరల్ ఆర్ట్స్ అండ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సేవా సంస్థ అధ్యక్షుడు గోపాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్

ఇంద్రవెల్లి: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని మారుమూల గ్రామమైన పిట్టబొంగరంలో కేంద్ర బలగాలతో ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

9న రాంజీగోండ్ వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాంజీగోండ్ విగ్రహం వద్ద ఈనెల 9న క్రాంతివీర్ రాంజీగోండ్ 164వ వర్ధంతిని నిర్వహించడం జరుగుతుందని హీరాసుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. గురువారం రాంజీగొండ్ విగ్రహాం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల హక్కుల కోసం రాంజీగోండ్ బ్రిటీష్ వారితో పోరాడి అమరుడయ్యాడని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహానీయుడి వర్ధంతి, జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఆదివాసీలు, రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అడవికి నిప్పు.. వన సంపదకు ముప్పు

- రక్షణకు అధికారుల చర్యలు
- అడవుల్లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ఫైర్‌లైన్స్ వేస్తున్న సిబ్బంది



చింతకర్ర అడవుల్లో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

కెరమెరి: వేసవి కాలం మొదలైంది.. భానుడు భగభగ మండుతున్నాడు. ఈ సమయంలో చిన్న అగ్గిరవ్వ పడ్డ పెద్ద ఎత్తున అటవీ సంపద కాలిపోయే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో అడవుల సంరక్షణకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అడవుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పడినప్పుడు మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఆకతాయిల వల్ల..

అనేక ప్రాంతాల్లో పశువుల కాపర్లు ధూమపానం చేసి బీడీ, సిగరెట్లు అటవీ ప్రాంతంలో పడేయడం వల్ల ఎండిన ఆకులకు నిప్పంటుకొని అడవి మొత్తం వ్యాప్తి చెందుతుంటాయి. రైతులు పొలాల్లో ఉన్న చెత్తను కాల్చినప్పుడు గాలితో లేచిన నిప్పురవ్వలు వల్ల అడవుల్లో మంటలు వ్యాప్తి చెందుతుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో మంటలు వ్యాప్తి చెందుతాయి. దీంతో అధికారులు గ్రామాల్లో పర్యటించి అడవుల రక్షణపై ప్రజలకు అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంటలను ఆర్పే పద్ధతులు, మంటలు ఒక చోటు నుంచి మరో చోటుకు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఇటీవల ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు. మంటలను ఆర్పే బ్లోయెర్లను సిబ్బందికి అందుబాటులో ఉంచారు.

67,403 ఎకరాల్లో అడవులు

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 67 వేల 403 ఎకరాల్లో అడవులు వ్యాపించి ఉన్నాయి. కానీ వాటి సంరక్షణకు అనుకున్న స్థాయిలో సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. 25 బీట్లు, 10 సెక్షన్‌లు ఉండగా, ఒక రేంజ్ అధికారితో పాటు 8 మంది బీట్ అధికారులు, ఆరుగురు సెక్షన్ అధికారులు ఉన్నారు. రేంజ్ వ్యాప్తంగా 35 మంది సిబ్బంది ఉండాలి. కానీ కేవలం 14 మంది మాత్రమే ఉన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల చాలా నష్టాలు ఉన్నాయి. అడవుల్లో వృద్ధి చెందాల్సిన వృక్షాలు ఎదగడం ఆగిపోతుంది. వన్య ప్రాణులు అడవులు లేకపోవడం వల్ల గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉంది. పెద్ద మంటల్లో చిక్కుకొని జింకలు వంటి వన్యప్రాణులు మృతి చెందే అవకాశం కూడా ఉంది. కావున అడవుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

సమాచారమందించాలి



అడవుల్లో మంటలు ఎగిసినప్పుడు అటవీ సిబ్బందికి, అధికారులకు సమాచారమందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. అగ్ని రేఖలు గీసి మంటలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– నాగేశ్వర్‌గౌడ్, ఇన్‌చార్జి రేంజ్ అధికారి

అవగాహన కల్పిస్తున్నాం



అడవులకు నిప్పు పెట్టవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడికక్కడ ఫైర్‌లైన్స్ వేస్తున్నాం. అడవులను రక్షించడం మనందరి బాధ్యత. ఆకతాయిలు, పశువుల కాపర్లు నిరక్ష్యంగా ప్రవర్తించవద్దు.

– రామయ్య, బీట్ అధికారి

వైభవంగా రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠాపన

చింతలమానెపల్లి మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ప్రతిష్ఠాపనతో ముగిశాయి. భక్తుల నృత్యాలు, గీతాలాపనల మధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతులు శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి, శ్రీ జగదీశ్వరానంద స్వామి, శ్రీవిష్ణు దేవానంద గిరి స్వాముల ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది.

– చింతలమానెపల్లి



శ్రీరాధాకృష్ణుల విగ్రహాలు



ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పీఠాధిపతులు



నృత్యం చేస్తున్న భక్తులు

తొలగించని ఎమ్మెల్యే స్టిక్కర్



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో శ్యామ్ నాయక్ వాహనం

వాంకిడి: మండలంలోని ఎనోలి గ్రామంలో గురువారం నిర్వహించిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఎమ్మెల్యే స్టిక్కర్ అంటించి ఉన్న వాహనంలో కార్యక్రమానికి రావడం చర్చనీయాంశమైంది. స్టిక్కర్‌పై 'వాలిడ్ అప్ టు డిసెంబర్ 2023' అని ఉండగా, గడువు తీరినా ఎమ్మెల్యే స్టిక్కర్ తొలగించకుండా శ్యాం నాయక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

ఘనంగా పూలే దంపతుల విగ్రహావిష్కరణ



విగ్రహాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని ఎనోలి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూలాజీ బాబా ముఖ్య సంస్థాన్ పాట్నాపూర్ అధ్యక్షుడు ఇంగ్లె కేశవ్ రావు, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, మాలి సంఘం మండల అధ్యక్షుడు వడై బాబురావు, నాయకులు గుర్నులె మెంగాజీ, దుర్గం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి పాదయాత్ర



మాట్లాడుతున్న నాయకులు

కెరమెరి: మండలంలోని శంకర్‌లొద్ది నుంచి పోహరాదేవికి ఈ నెల 9 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 9న ఉగాది పర్వదినం పురస్కరించుకొని శంకర్‌లొద్దిలోగల శివలింగం గుహలో పూజలు చేస్తామన్నారు. 12.30 గంటలకు భోగ్‌భండార్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాయంకాలం 6 గంటల నుంచి కొత్తపల్లి మీదుగా ఉమ్మడి జిల్లాలోని 5000 మంది సేవాలాల్ భక్తులతో మహారాష్ట్రలోని పోహరాదేవి వరకు సుమారు 300 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వెంకట్‌రాంనాయక్, దేవ్‌జీ, తిరుపతి, రాజేశ్ తదితరులు ఉన్నారు.

26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాన్ సెమిస్టర్ విధానంలో డిగ్రీలో అడ్మిషన్ తీసుకొని డిగ్రీ ఫెయిల్ అయిన 2015, 2016, అంతకుముందు సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు తమ పరీక్ష ఫీజు ఈనెల 26లోగా చెల్లించాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలికల రక్షణ కోసమే షీటీం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సునీత

కెరమెరి: బాలికల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. గురువారం మండలంలోని మోడీ కేజీబీవీలో ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో వివిధ అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైన గురైతే వెంటనే షీం టీంను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయాల్లో 100కు కాల్ చేయాలన్నారు. ఆసిఫాబాద్ షీటీం నంబర్ 8712670564కు డయల్ చేయాలన్నారు. షీటీం సభ్యురాలు శ్రీలత, స్వప్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఓల్డ్), బస్టాండ్ ఆవరణలో గురువారం షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. గృహిణులు ఎదుర్కొంటున్న సమస్యలపై, సైబర్ క్రైం నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని షీటీం అధికారి శ్రీనివాస్ అన్నారు. సైబర్ క్రైమ్ ఇబ్బందులు ఉంటే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

తలమడుగు: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి దుద్‌రాం రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు, కప్పర్‌దేవి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులను ఉదయం పూట విడిచిపెట్టకుండా ఉంచుకోవాలని సిబ్బంది సూచించారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 9 గ్రామ పంచాయతీలలో గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. రైతులు గంగారం, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



రవీందర్‌ను సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్ నూతనంగా నియామకమైన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా ట్రస్మా ప్రతినిధులు ఆయనతో పాటు అసోసియేషన్ సభ్యులను సన్మానించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావ్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. సభ్యులు దేవభూషణం, సంజీవ్‌కుమార్, మహేశ్, లక్ష్మణచారి, కోటేశ్వర్, నరేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి మోక్షమెప్పుడో..?

- సబ్‌సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తి
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- సకాలంలో వైద్యసేవలు అందక రోగులకు తిప్పలు



రెబ్బెనలో పనులు పూర్తయిన సబ్ సెంటర్ భవనం

రెబ్బెన: గ్రామీణ ప్రాంత ప్రజలకు, రోగులకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఏళ్లుగా సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేకపోవటంతో వైద్యసిబ్బంది, రోగులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు గత ప్రభుత్వం సంవత్సరం క్రితం సబ్ సెంటర్లకు పక్కా భవనాలు మంజూరు చేసింది. టెండర్ల ద్వారా నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు వాటిని ప్రారంభించలేదు. దీంతో క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు సకాలంలో వైద్యసేవలు, ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు అందకపోవటంతో అవస్థలు పడుతున్నారు.

మండలానికి 5 భవనాలు మంజూరు

మండలంలోని గోలేటి, రెబ్బెన, నంబాల, నారాయణపూర్, కైరిగాం, నవేగాంలలో సబ్ సెంటర్లు ఉండగా కేవలం గోలేటి సబ్ సెంటర్‌కు మాత్రమే పక్కా భవనం అందుబాటులో ఉంది. మిగిలిన ప్రాంతాల్లోని సబ్ సెంటర్లు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో ఉండే అరకొర వసతులతో వైద్య సిబ్బందితో పాటు సబ్ సెంటర్‌కు వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏడాది క్రితం ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో మొదటగా ఒక్కో సబ్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. నిధులు సరిపోవని అదనంగా మరో రూ.4లక్షలు కేటాయించింది. దీంతో ఒక్కో సబ్ సెంటర్ పక్కా భవనానికి మొత్తంగా రూ. 20లక్షలు మంజూరయ్యాయి. గత సంవత్సరం టెండర్ల ద్వారా నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నంబాల, రెబ్బెన, కైరిగాం, నవేగాంలలో నిర్మాణ పనులు పూర్తి కాగా ఒక్క నారాయణపూర్‌లో మాత్రం భవన నిర్మాణ స్థలం వివాదంలో ఉండటంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. మిగిలిన నాలుగు సెంటర్ల పక్కా భవన నిర్మాణ పనులు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా అధికారులు కాంట్రాక్టర్ల వద్ద నుంచి స్వాధీనం చేసుకొని భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం లేదు.

అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాలు

పక్కా భవనాలను ప్రారంభించకపోవటంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య సబ్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ఒక్కో సబ్ సెంటర్ పరిధిలో ఒక ఏఎన్ఎం, ఇద్దరు ఆశవర్కర్లు పని చేస్తున్నారు. ఆయా సబ్ సెంటర్ల పరిధిలో ఉండే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు సబ్ సెంటర్ల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా అన్ని వసతులతో పక్కా భవనం పూర్తయినా వైద్య సిబ్బందికి అందుబాటులోకి రాకపోవటంతో సిబ్బంది నిరుత్సాహానికి గురవుతున్నారు.

డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్తాం

రెబ్బెన మండలంలో నాలుగు సబ్‌సెంటర్ల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెబ్బెన, నంబాల సబ్‌సెంటర్లలో 100శాతం పనులు పూర్తి కాగా, కైరిగాం, నవేగాం సబ్‌సెంటర్లలో చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి సైతం త్వరలో పూర్తి చేసి డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్తాం.

– సందీప్ రెడ్డి, ఏఈ, టీఎస్‌ఎంఐడీసీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏనుగు సంచారంపై అధికారుల హెచ్చరిక
- పలు మండలాల్లో 144 సెక్షన్ విధింపు



దహెగాం: అవగాహన కల్పిస్తున్న అధికారులు

దహెగాం: ఏనుగు బీభత్సం సృష్టించి ఇద్దరిని హతమార్చడంతో మారుమూల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో శ్రీధర్‌చారి అన్నారు. గురువారం మండలంలోని లోహ గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏనుగు ఎదురుపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఏనుగు కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో రవిబాబు, ఎఫ్‌బీవోలు మధుకర్, సద్దాం, యానిమల్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

కౌటాల: సిర్పూర్ నియోజకవర్గంలోని చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో ఏనుగు సంచరిస్తుండడంతో మండలంలో 144 సెక్షన్‌ను విధించినట్లు తహసీల్దార్ పుష్పలత గురువారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ విధించామన్నారు. ఏనుగు సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

దహెగాం: చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో ఏనుగు బీభత్సం సృష్టించి ఇద్దరు రైతులపై దాడి చేసి హతమార్చడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ విధించినట్లు తహసీల్దార్ కవిత పేర్కొన్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై రాజు ఆధ్వర్యంలో గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డప్పు చాటింపు వేయించారు.

బెజ్జూర్: గత రెండు రోజులుగా చింతలమానపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో ఏనుగు సంచరిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. మండల కేంద్రంతో పాటు అటవీ ప్రాంత సమీపంలోని ఆయా గ్రామాల్లో గురువారం బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్, కౌటాల సీఐ సాదిక్ పాషాల ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించారు. ఏనుగు కదలికలపై అప్రమత్తమంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

గుడుంబా పట్టివేత

జైనూర్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని (కాలేజిగూడ) రాంనగర్‌కు చెందిన తాయాబాయి అనే మహిళ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 3 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దారి కోసం గుట్టను తవ్వారు!



జైనూర్ మండలంలోని జామ్ని సడక్‌గూడ శివారులో కొందరు దారి కోసం ఏకంగా గుట్టను తవ్వి చదును చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి మండలంలోని జామ్ని శివారులో కొందరు వ్యక్తులు గుట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్నారు. గుట్టను తవ్వే సమయంలో అటవీ అధికారులకు సమాచారం అందించినా ఏమి పట్టనట్లు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుట్టను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. – జైనూర్